అమలు కాని పథకాలు.. మహిళల దిగాలు

- వైఎస్సార్‌సీపీ హయాంలో సామాజిక సాధికారతే లక్ష్యం
- నేడు కూటమి పాలనలో నిర్లక్ష్యం


ద్వాక్రా ప్రాంతీయ సమావేశంలో పాల్గొన్న మహిళలు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి మహిళా ఏటా కనిష్టంగా రూ.50 వేలు నుంచి గరిష్టంగా రూ.లక్ష వరకు ప్రభుత్వం నుంచి సంక్షేమ లబ్ధి పొందారు. దీంతో తమ ఆర్థిక అవసరాల కోసం మగవారిపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా మహారాణులుగా చెలామణి అయ్యారు. నేడు కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఏడాదిన్న గడిచినా పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో మహిళలు డీలాపడుతున్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామీ నేటికీ పట్టా లెక్కలేదు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు ఆర్థిక సాయం ఊసే లేదు.

వ్యాపారాలు వెలవెల

వైఎస్సార్‌సీపీ హయాంలో నిత్యం కొనుగోలు దార్లతో సందడిగా కన్పించే వ్యాపారాలు నేడు వెలవెలబోతున్నాయి. నాడు ప్రతి మహిళ ఖాతాల్లోకి ప్రతి మూడు నెలలకు ఒకసారి ఏదో ఒక పథకం పేరుతో నగదు బదిలీ అయ్యేది. ఫలితంగా మహిళలు తమకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసేందుకు మార్కెట్‌కు తరలి వచ్చేవారు. వ్యాపారాలు నిండు కుండలా ఉండేవి. నేడు అందుకు భిన్నమైన పరిస్థితి కూటమి పార్టీల పాలనలో కన్పిస్తోంది. మహిళల వద్ద రూపాయలు ఆడకపోవడంతో వారి కొనుగోలు శక్తి పడిపోయింది. నిత్యం కళకళలాడిన వ్యాపారాలు నేడు వెలవెలబోతున్నాయి.

వైఎస్సార్‌సీపీ హయాలోనే సంక్షేమం

వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక్క ఏలూరు నియోజకవర్గంలోని 79 సచివాలయాల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతర వర్గాలకు ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా రూ.958,72,38,563, పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ) ద్వారా రూ.729,03,92,844 కలిపి మొత్తం రూ.1,687,76,31,407 ప్రయోజనం చేకూరింది. 1,89,110 మందికి లబ్ధి చేకూరింది. నియోజకవర్గంలోని ఓటర్లలో దాదాపు 90 శాతానికి పైగా ప్రజలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం అందింది. దీనికి అదనంగా నియోజకవర్గంలోని 29,592 మందికి ఇళ్ల స్థలాలను ప్రభుత్వం అందించింది.

నాడు వెలుగులు



వైఎస్సార్‌సీపీ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల వల్ల మహిళల జీవితాల్లో వెలుగులు వెల్లివిరిచాయి. సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకు లబ్ధి చేకూరింది. ఇదంతా నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలవే. నేడు అందుకు భిన్నమైన పాలన రాష్ట్రంలో నడుస్తోంది.
– సీహెచ్ సాయినిర్మల, గృహిణి, ఆముదాల అప్పలస్వామి కాలనీ, ఏలూరు

విప్లవాత్మక మార్పుకు శ్రీకారం



వైఎస్సార్‌సీపీ హయాంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఓటు బ్యాంకు రాజకీయాలకే వాడుకున్న పాలకులకు భిన్నంగా జగన్ పరిపాలించి చూపించారు. ప్రత్యక్ష నగదు బదిలీ వల్ల బలహీన వర్గాల్లో కొనుగోలు శక్తి పెరిగింది.
– జిజ్ఞవరపు విజయ నిర్మల, కార్పొరేటర్, ఏలూరు నగరపాలక సంస్థ, ఏలూరు

'పరివర్తన్'కు నిత్యావసర సరుకుల పంపిణీ


విద్యార్థులకు నిత్యావసరాలు అందజేస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): స్థానిక ఏలూరు దొండపాడు పరివర్తన్ దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు స్ఫూర్తి సేవా కమిటీ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్ చేతుల మీదుగా రూ.10 వేలు విలువ గల బియ్యం, సరుకులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఏలూరు జిల్లా ప్రభుత్వ అంధుల ఉద్యోగులు ప్రెసిడెంట్ వీరభద్రరావు మాట్లాడుతూ మథర్ థెరిస్సా స్ఫూర్తితో విద్యార్థులకు తమవంతు సాయం చేశామన్నారు. ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్ఫూర్తి సేవా కమిటీ ప్రెసిడెంట్ దేవరాజు, సెక్రటరీ ఏసురాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

22న వాహనాల బహిరంగ వేలం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జంగారెడ్డిగూడెం ఆర్టీఓ కార్యాలయం పరిధిలో రవాణా శాఖ ద్వారా నిర్బంధించిన రవాణా, రవాణేతర వాహనాలకు ఈ నెల 22న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3 గూడ్స్ క్యారియర్లు, 1 మ్యాక్సీ క్యాబ్, 3 ట్రాక్టర్లు, 9 మోటార్ సైకిల్స్‌కు జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోలో ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ కార్మికులు సమస్యల పరిష్కారానికి సీఐటీయూ వీరోచిత పోరాటాలు నిర్వహిస్తోందని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వర రావు అన్నారు. బుధవారం సీఐటీయూ కార్యాలయంలో పలువురు మున్సిపల్ వర్కర్స్ యూనియన్లో చేరారు. వారికి ఉమామహేశ్వర రావు సీఐటీయూ కండువాలు కప్పి ఆహ్వానించారు. సీఐటీయూ నాయకులు ఆర్ లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్, బాలరాజు, వైఎస్ కనకారావు, ఎం ఇస్సాక్, జె.గోపి, పంపన రవికుమార్ పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూలోకి కార్మికులు

ఏలూరు (టూటౌన్): నగరంలోని మున్సిపల్, ముఠా, భవన నిర్మాణ కార్మికులు, వీధి వ్యాపారులు పెద్ద సంఖ్యలో సీఐటీయూ మాజీ జిల్లా అధ్యక్షులు బి.సోమయ్య ఆధ్వర్యంలో బుధవారం ఐఎఫ్‌టీయూలో చేరారు. స్థానిక పాండురంగ థియేటర్ సమీపంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఉన్న కార్మిక సంఘాల కార్యాలయంలో నిర్వహించిన సభలో వారంతా ఇష్టాలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు కేవీ రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావులు వారికి ఆహ్వానం పలికారు.

దీపక్ నాయుడు మృతికి సంతాపం


నివాళులర్పిస్తున్న జయప్రకాష్

ఏలూరు టౌన్: ఏలూరు ఆర్‌ఎంఎస్ కాలనీ రెండో లైన్ ప్రాంతానికి చెందిన దీపక్ నాయుడు ఆకస్మికంగా మృతిచెందారు. ఆయన మృతదేహంపై వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయ కర్త మామిళ్లపల్లి జయప్రకాష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లిపాక సురేష్, స్థానిక నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

లాంగ్వేజ్ పండిట్లను అప్‌గ్రేడ్ చేయాలి


సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు నగరపాలక సంస్థ పరిధి హైస్కూళ్లలో పనిచేస్తున్న లాంగ్వేజ్ పండిట్లను కూడా జిల్లా పరిషత్ మేనేజ్మెంట్ ఉపాధ్యాయుల్లానే అప్‌గ్రేడ్ చేయాలని, అంతర్ జిల్లాల బదిలీల్లో స్పౌజ్, మ్యూచువల్ కేటగిరీల్లో మున్సిపల్ ఉపాధ్యాయులకు కూడా అవకాశం కల్పించాలని ఏపీటీఎఫ్ ఏలూరు నగర శాఖ ప్రధాన కార్యదర్శి అబ్బదాసరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం స్థానిక కేఆర్‌డీజీకే మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జీఓ నంబర్ 84 ద్వారా మున్సిపల్ ఉపాధ్యాయులు, పాఠశాలలపై పర్యవేక్షణను తన పరిధిలోకి తీసుకున్నప్పటికీ మునిసిపల్ ఉపాధ్యాయుల పట్ల పక్షపాత ధోరణి అవలంబిస్తోందని ఆరోపించారు. ఏఆర్‌డీజీకే పాఠశాల హెచ్‌ఎం వి.కాంతి జయకుమార్‌నే ఏపీటీఎఫ్ సభ్యునిగా చేర్చుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రామారావు, నగర శాఖ అధ్యక్షుడు కురమా ఆనంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ డిస్లెక్సియా దినోత్సవం


సదస్సులో మాట్లాడుతున్న హెచ్‌ఎం గారపాటి ప్రకాష్

ఏలూరు (టూటౌన్): ప్రపంచ డిస్లెక్సియా దినోత్సవం సందర్భంగా ఏలూరులోని దొండపాడులోని జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం, శనివారపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గారపాటి ప్రకాష్ రావు మాట్లాడుతూ డిస్లెక్సియా దినోత్సవ లక్ష్యం చదవడం, రాయడం, అక్షరాలను గుర్తించడం వంటి నైపుణ్యాల్లో ఇబ్బందులు ఎదుర్కొనే పిల్లలు, పెద్దలకు అవగాహన పెంపొందించడమన్నారు. సంస్థ కోఆర్డినేటర్ డి.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ డిస్లెక్సియా సంకేతాలు ప్రీస్కూల్ వయస్సు నుండే కనిపిస్తాయన్నారు. డిస్లెక్సియాను ఒక సమస్యగా కాకుండా ఒక ప్రత్యేకతగా గుర్తించి, ప్రతి ఒక్కరూ సమానంగా విద్యను పొందగల ఒక సమ్మిళిత వాతావరణాన్ని సృష్టించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులతో పాటు జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది కూడా పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా జట్ల ఎంపిక పోటీలు


కబడ్డీ ఎంపిక పోటీల్లో తలపడుతున్న బాలికలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అండర్–17, –14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు సంబంధించి ఖోఖో, కబాడీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా వంటి వివిధ క్రీడల జట్ల ఎంపిక పోటీలు బుధవారం స్థానిక శనివారపు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీల్లో ఏలూరు జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ కె.పంకజ్ కుమార్, ఏడీ–2 వెంకట అప్పయ్య, మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ వి.అరుణ కుమార్, ప్రధానోపాధ్యాయుడు జి.ప్రకాష్‌రావు, ఏలూరు మండల కన్వీనర్ పద్మలత, పీడీ అండ్ పీఈటీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఇందుకూరి రమేష్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారులు నిర్మించాలి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు, మండల కార్యదర్శి ఎం.జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

లాభాపేక్ష లేకుండా సేవ చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

ఏలూరు (టూటౌన్): పారా లీగల్ వాలంటీర్లు కక్షిదారులకు జిల్లా న్యాయసేవాధికార సంస్థకు వారధిగా మంచి సేవలు అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ శ్రీదేవి అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాలు ప్రకారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ శ్రీదేవి, బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో పారా లీగల్ వాలంటీర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ లాభాపేక్ష ఆశించకుండా స్వచ్ఛందంగా ప్రజలకు సేవ చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాదు మాట్లాడుతూ వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పీఎస్ మునీశ్వరరావు, మాస్టర్ ట్రైనర్ పి.రత్నరాజు పాల్గొన్నారు.

సీజేఐపై దాడిని ఖండించాలి


ఫైర్ స్టేషన్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ఏలూరు (టూటౌన్): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌పై జరిగిన మతోన్మాద దాడిని ప్రజాస్వామిక వాదులు అందరూ ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డీఎన్‌వీడీ ప్రసాద్ కోరారు. స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్లో సీపీఎం ఆధ్వర్యంలో సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ బుధవారం ఆందోళన నిర్వహించారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, మతోన్మాదం నశించాలని, లౌకికవాదం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా అభ్యుదయవాదులు ప్రజాస్వామికవాదులు వామపక్ష శక్తులపై మతోన్మాదులు దాడులు పెరిగాయన్నారు. సీపీఎం ఆందోళనకు జై భారత్ పార్టీ నాయకులు పాము రవీంద్రనాథ్ రాంబాబు, దేవరపల్లి రత్నబాబు, కనకరాజు మద్దతు తెలిపారు. సీపీఎం నగర కార్యదర్శి పంపన రవికుమార్, జిల్లా కమిటీ సభ్యులు జీవీఎల్ నరసింహారావు నాయకులు అరుణతార నాగేశ్వరరావు,ఎం శ్యామలా రాణి, లెనిన్, ఎం ఇస్సాక్, జె.గోపి, మావూరి శ్రీనివాస్, కాకర్ల రాజేంద్రప్రసాద్, కొప్పాడ నరసింహస్వామి, అమర్ కుమార్, జి కోటేశ్వరరావు,బి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	22	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	00	బీళ్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	34
బెండకాయలు	24	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	52	కంద	00
కాకర కాయలు	34	బీట్‌రూట్	44
బీరకాయలు	34	కీరా దోస	44
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	52	కొత్తిమీర (కట్ట)	30
దొండకాయలు	34	పాలకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	22	చుక్కకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	26	పుదీనా	05
ఆనబకాయ (1)	25	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	37
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	07
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	15
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	21
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	23
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

రహదారుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎ.రవి

టి.నరసాపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రహదారుల నిర్మాణాన్ని గాలికొదిలేసిందని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. టి.నరసాపురంలో సీపీఎం మండల కమిటీ సమావేశం బొద్దుల గంగా భవానీ అధ్యక్షతన నిర్వహించారు. రవి మాట్లాడుతూ సరైన రహదారులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. లక్ష్మీపురం నుంచి టి.నరసాపురం మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు, చింతలపూడి కనెక్టింగ్ రోడ్డు, మక్కినవారిగూడెం రోడ్డు, తదితర రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. మండల కార్యదర్శి మడకం సుధారాణి, మడకం కుమారి, శిరీష, పూసం సూర్యారావు, గూడెల్లి వెంకటరావు, అనుమోలు మురళి, సయం దుర్గమ్మ పాల్గొన్నారు.

నిమ్మలో ఎండు తెగులు

దెందులూరు: నిమ్మ తోటల్లో ఎండు తెగులు ఆశించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దెందులూరు, పెదవేగి మండలాల్లో వరి, ఆయిల్‌పామ్, మొక్కజొన్న తరువాత అధికంగా సాగు చేసే పంట నిమ్మ. కొన్ని మొక్కలు పూర్తిగా ఎండిపోవడం, కొన్ని మొక్కలు ఎండి పడిపోవడం, మరి కొన్ని మొక్కలు కాపు కాయకపోవడం జరుగుతోందని రైతులు అంటున్నారు. దీనిపై హార్టికల్చర్ ఆఫీసర్ కరన్‌ను వివరణ కోరగా నిమ్మ తోటల్లో పూర్తిగా ఎండిపోయిన, పడిపోయిన మొక్కలను వెంటనే మొదలుకు తొలగించాలి. తోట నుంచి దూరంగా పారవేయాలి. గ్రామాల్లో రైతుసేవా కేంద్రాల్లో ఉన్న హార్టికల్చర్ అసిస్టెంట్లను కలిసి మొక్కలను చూపించి పరిస్థితిని బట్టి నివారణ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి

జంగారెడ్డిగూడెం: మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రేలంగి నాగరాజు అన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగులకు 12వ పీఆర్‌సీ ప్రకటించాలని, వెంటనే ఐఆర్ ఇవ్వాలని, మున్సిపల్ ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు.

వక్తృత్వ పోటీ విజేతలకు అంభినందన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మధ్యాహ్నం కళాశాల ఎకనామిక్స్, కామర్స్ డిపార్ట్‌మెంట్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సూపర్ జీఎస్‌టీ సూపర్ సేవింగ్స్ అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ద్వితీయ సంవత్సరం బీకామ్ విద్యార్థి ఎస్‌కే అబ్దుల్ మతీన్ ప్రథమ, ప్రథమ సంవత్సరం బీఎస్సీ గణిత విద్యార్థి టి.సౌజన్య ద్వితీయ, తృతీయ సంవత్సరం బీఏ చరిత్ర విద్యార్థి టి.సాయి పద్మజ తృతీయ బహుమతిని సాధించారని తెలిపారు. జీఎస్టీ జిల్లా డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎం సునీత ముఖ్య అతిథిగా హాజరై మొదటి సంవత్సరం బీఎస్సి మ్యాథ్స్ విద్యార్థి వై.నందిని, ద్వితీయ సంవత్సరం బీఏ విద్యార్థి కె.లహరికి కన్సోలేషన్ బహుమతిగా రూ.500 చొప్పున అందజేశారు. విజేతలను కళాశాల ప్రధానాచార్యుడు గుత్తా గిరిబాబు అభినందించారు. న్యాయ నిర్ణేతలుగా అధ్యాపకులు ఎం రాంబాబు, డి.సుజాత వ్యవహరించారు. జీఎస్‌టీ అధికారులు సీహెచ్ కిరణ్ కుమార్, జి.గోపాలకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ జి.ఇందిరమ్మ హాజరయ్యారు.

దీపావళి సామగ్రి పట్ల అప్రమత్తంగా ఉండాలి

దెందులూరు: ఆన్‌లైన్ పార్సిల్‌లో వచ్చే దీపావళి సామగ్రి పట్ల ఆర్టీసీ సిబ్బంది, వినియోగదారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఏలూరు రూరల్ తహసీల్దార్ జి.విజయకుమార్ రాజు అన్నారు. బుధవారం చాటపర్రులోని ఏలూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కలెక్టర్, ఎస్పీ, ఫైర్ ఆఫీసర్ ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఏలూరు రూరల్ మండలంలో ఏ ఒక్క గ్రామంలోనూ ఆర్‌డీఓ అనుమతి లేకుండా దీపావళి సామగ్రి అమ్మకానికి నిల్వ ఉంచటం చేయరాదన్నారు. ప్రతి ఒక్కరు సంతోషంగా దీపావళిని నిర్వహించుకోవాలని సూచించారు. సామాగ్రి చిన్నారులు కాల్చేటప్పుడు కుటుంబ సభ్యులు తల్లిదండ్రులు దగ్గర ఉండి జాగ్రత్త తీసుకోవాలన్నారు.

విద్యార్థిని పరామర్శించిన డీఈఓ


పాఠశాలలో విచారణ చేస్తున్న డీఈఓ వెంకటలక్ష్మమ్మ

దెందులూరు: కరెంట్ షాక్‌తో ప్రమాదానికి గురైన గోపన్నపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థి కార్తీక్‌ను బుధవారం ఆశ్రం హాస్పిటల్ ఐసీయూలో డీఈఓ వెంకట లక్ష్మమ్మ పరామర్శించారు. కార్తీక్ ఆమెతో మాట్లాడాడు. ఆరోగ్యం, వైద్య సేవలపై సంబంధిత వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఎం సుభాషిణి, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు. గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో డీఈఓ విచారణ చేశారు. పాఠశాలలో కరెంట్ షాక్‌తో విద్యార్థి, టీచర్ ప్రమాదానికి గురైన పరిస్థితులపై ఆరా తీశారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

భక్తులను డబ్బులు డిమాండ్ చేసిన మహిళ

ద్వారకాతిరుమల: మొక్కుబడి పేరుతో భక్తులను మోసగించి వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఓ మహిళను శ్రీవారి దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. వివరాల్లోకి వెళితే..శ్రీవారి ఆలయ పరిసరాల్లో ఏలూరుకు చెందిన ఓ మహిళ గత కొద్ది రోజులుగా బిక్షాటన చేస్తోంది. యాచించిన సొమ్ముతో స్వామి వారికి మొక్కుబడి చెల్లించాలన్న సెంటిమెంట్ పేరుతో, భక్తులను డిమాండ్ చేస్తూ ఒక్కొక్కరి వద్ద రూ.100 నుంచి రూ.500 వసూలు చేస్తోంది. ఈ మేరకు ఆమెను దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

వాహన తనిఖీలు

జంగారెడ్డిగూడెం: నిబంధనలు పాటించి వాహనాలను నడపాలని పాఠశాలల యాజమాన్యాలకు ఆర్టీఓ (ఎఫ్ఏసీ), ఎంవీఐ ఎస్ఎస్ రంగనాయకులు సూచించారు. జంగారెడ్డిగూడెంలో బుధవారం పాఠశాలల బస్సుల తనిఖీ నిర్వహించారు. ఏఎంవీఐ కేడీవీ రవిగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ


సమస్యలు వివరిస్తున్న రైతులు

భీమడోలు: జాతీయ రహదారి పి.కన్నాపురం, కోడూరుపాడు గ్రామాల్లో రైల్వే గేట్లు మూసి వేసి రైల్వే అభివృద్ధి పనులు చేపట్టనున్న నేపథ్యంలో బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ, ఆ ప్రాంతాలను పరిశీలించేందుకు రైల్వే అధికారులు, రెవెన్యూ ఉన్నతాధికారుల బృందం పర్యటించింది. పి.కన్నాపురం రైల్వే గేటు సమీపంలోని పూళ్ల వద్ద రైతులు, ప్రజలతో వారు సమావేశం నిర్వహించి, అభిప్రాయాలను సేకరించారు. పి.కన్నాపురం లెవెల్ క్రాసింగ్ 363 ఏ గేటు మూసి వేసినట్లయితే ఇక్కడ ఫ్లై ఓవర్ గాని, అండర్ పాస్ గాని నిర్మించాలని గ్రామస్తులు, రైతులు ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. కోడూరుపాడు వద్ద ఫ్లై ఓవర్ నిర్మిస్తున్నందున, కనెక్షన్ రోడ్డును రైల్వే నిధులతో నిర్మించి, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని రైల్వే అధికారులు చెప్పడంతో రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సమస్యను తీసుకెళతామని అధికారులు అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏలూరు ఆర్డీఓ అచ్యుత అంబరీష్, రైల్వే ఉన్నతాధికారులు, తహసీల్దార్ బి.రమాదేవి, సర్పంచ్ దాయం సుజాత, పెద్దలు, రైతులు పాల్గొన్నారు.